

భగత్ సింగ్ తెగువ.. భావితరాలకు ఆదర్శం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: భారత స్వాతంత్ర్య సమరంలో భగత్ సింగ్ చూపిన తెగువ భావి తరాలకు ఆదర్శమని సీపీఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి కొనియాడారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో భగత్ సింగ్ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 'భగత్ సింగ్ అమర్ రహే' అంటూ నినాదాలు ఇచ్చారు. భారత స్వాతంత్ర్యం కోసం భగత్ సింగ్ తో పాటు సుఖదేవ్, రాజ్ గురు ముగ్గురూ నవ్వుతూ ఉరికంబానెక్కిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధులని మణి కొనియాడారు. నేటి యువత వారి త్యాగాలను తెలుసుకొని సామాజిక బాధ్యతతో, దేశభక్తితో మెలగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పెనగడం గురవయ్య, గురునాథం, చుట్టు గురవయ్య, కుమార్, భాజీ రావు తదితరులు పాల్గొన్నారు.

నీటికోసం.. కోటి కష్టాలు

◆ గుక్కెడు నీటికి గుంటే ఆధారం ◆ పాచి పట్టిన నీటితో అనారోగ్యం ◆ జంతు జాలానికి అదే ఆధారం ◆ బోరు నీరు బురద మయం ◆ ఎస్టీ కాలనీ వాసులకు తప్పని తిప్పలు



బురద, పాచిమయమైన నీటి గుంటలో నీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - బాలాయపల్లి: ఆధునిక జీవనం.. సైన్స్.. అభివృద్ధి.. ఏఐ టెక్నాలజీ కోసం ప్రపంచం పరుగులు. మనమేం తక్కువ కాదన్నట్లు మన ప్రభుత్వాలు.. అభివృద్ధి అంటే.. ఆకాశానికి ఎగరడం కాదు. భూమిపై ప్రతి మానవుడు కనీస వసతులతో జీవించడం. ఇది మరచినట్టున్నారు మన పాలకులు. గుక్కెడు నీటికోసం ఇంకా మైళ్లకొద్దీ బిందెలతో వెళుతున్న సామాన్య జనం. అధికారుల నిర్లక్ష్యం.. పాలకుల శీతకన్ను.. వెరశి పేదల కాలనీల్లో మౌలిక వసతులు కరువైన వైనం. పాలకులకు ఓట్లు అడిగేప్పుడే గుర్తొచ్చే పేదల కాలనీలు, ఎన్నికల అనంతరం కానరావు. మహిళలు ఒక చంకన బిడ్డను వేసుకుని, మరో చంకన బిందెను పెట్టుకుని నీటి కోసం వెళుతుంటే.. ఇది అభివృద్ధి అందామా..? పేదల బతుకులకు శాపమందామా..? నాయకులు ఒక్కొక్కరు ఒక గ్లాసు నీరు తాగాలంటే వేల రూపాయలు ఖర్చు పెడుతున్నారు. కానీ ఊరి బయట ఉండే చిన్నపాటి గుంటలో నీరు తాగుతున్న పేదల గొంతు ఎవరు నొక్కేస్తున్నారు? ఆ గొంతు పెగలిన రోజు ఎంతటివారైనా దిగిరాక తప్పదు. ప్రభుత్వాలకు పతనం తప్పదు. మురికి నీటితో జీవనం గడుపుతున్న మేల్పూరు ఎస్టీ కాలనీ వాసుల జీవన చిత్రంపై ప్రజాశక్తి ఫోకస్.

బాలాయపల్లి మండలం, పెరిమిడి పంచాయతీ, మేల్పూరు గ్రామం, ఎస్టీ కాలనీలో త్రాగునీరు, వాడకం నీరు లేక కాలనీవాసులు అలమటిస్తున్నారు. కాలనీలో ఎప్పుడో వేసిన బోరులో నీరు ఎర్రగా, బురదతో కూడుకుని వస్తుండటంతో ఎందకూ పనికిరావని కాలనీ వాసులు ఆవేదన చెందుతున్నారు. తమ కష్టాలు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక అల్లాడుతున్నారు. కాలనీకి దగ్గరలో ఉన్న చిన్న నీటి గుంటే వారికి ఆధారం. జంతుజాలం వాడుకకు కూడా ఆనీరే. ఆ నీరు కూడా అపరిశుభ్రంగా, బురద, పాచితో ఉంటాయని మహిళలు చెబుతున్నారు. ఆ నీటిని కాలనీ మహిళలు తెచ్చుకుని ఆవసరాలకు వాడుకుంటూ, తాగు నీరుగా కూడా ఉపయోగిస్తున్నారు. ఆ నీరు అశుభ్రంగా ఉండటంతో అవి తాగిన కాలనీవాసులు అనారోగ్యాలకు గురవుతున్నారు. వళ్లంతా దురదలు, వాంతులు, విరేచనాలతో ఆసుపత్రుల పాలవుతున్నారు. చిన్నారులు, వృద్ధుల పరిస్థితి ఇక చెప్పనక్కరల్లేదు. కాలనీకి కాస్త దూరంలో ఉన్న పంచాయతీ నీటిపైపులో నీరు వదిలిన పాపాన ఎప్పుడూ పోలేదు. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. వచ్చే ఎండాకాలం ఎలా రోజులు గడపాలో అని ఇప్పటినుండే వారు ఆందోళన చెందుతున్నారు. ఆ కాస్త నీటి గుంట ఎండలకు ఎండిపోతుంది. ప్రతి సంవత్సరం వర్షం నీరు నిలచిఉండే ఆ గుంట, కాలనీ ప్రజల, పశుపక్ష్యాదుల అవసరాలకు ఆదుకుంటోంది. కానీ ఎండలు ముదిరితే నీటి చెమ్మకూడా ఉండదు. మినరల్ వాటర్ కొనుక్కోలేని పేదలను ఇకనైనా అధికారులు, నాయకులు ఆదుకుంటారో లేదో వేచి చూడాలి. నిత్యావసరాలకు, తాగునీటికి ఇబ్బంది పడుతున్న తమను ఆదుకోవాలని కాలనీ వాసులు వేడుకుంటున్నారు.





మా కాలనీకి తాగు నీరు కానీ, వాడుకునే నీరుకానీ రావడం లేదు. దూరంగా ఉన్న నీటి గుంటలో నీరు తెచ్చుకుని ఉపయోగిస్తున్నాం. సర్పంచి పాడేటి వనమ్మకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా పట్టించు కోలేదు. అధికారులు, నాయకులు ఎవరూ ఇటు తిరిగి చూడరు. నీటి వసతి కల్పించి మమ్మల్ని ఆదుకోవాలి.

- ధనమ్మ, విఆర్ఎ, కాలనీవాసులు

కాలనీ వాసుల నీటి సమస్యను నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళతాను. నీటి వసతి లేక ఇబ్బంది పడుతోంది వాస్తవమే. స్థానిక నాయకులతో చర్చించి త్వరలో సమస్య పరిష్కారమయ్యేందుకు కృషి చేస్తాను.

- పాడేటి వనమ్మ, సర్పంచ్

భూ వివాదంతో నిర్మాణాల తొలగింపు



వివాద స్థలంలో కూల్చివేసిన గదులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): భూ వివాదంతో నిర్మాణాలను తొలగించిన ఘటన ఆదివారం మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీ పరిధిలో చోటుచేసుకుంది. మీడియాకు మునిరెడ్డి తెలిపిన వివరాల మేరకు నిర్మలమ్మ అనే మహిళ ద్వారా చెన్నాయిగుంట గ్రామ లెక్క దాఖలా సర్వేనెంబర్ 222/3లో ఉన్న 85 సెంట్ల భూమిపై జిపిఏ పొందానని మునిరెడ్డి తెలిపారు. అయితే అన్నాస్వామిపల్లెకు చెందిన ప్రభాకర్ రెడ్డి అనే వ్యక్తి అక్రమ రిజిస్ట్రేషన్ ద్వారా సదరు స్థలంలో నిర్మించిన గదులను నిర్మించారన్నారు. మునిరెడ్డి జెసిబి యంత్రాలతో కూల్చి వేస్తుండగా వివాదం నెలకొంది. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరు వర్గాలను వారికి సంబంధించిన స్థల యాజమాన్య పత్రాలు తీసుకొని తిరుచానూరు పోలీస్ స్టేషన్‌కు రావాలని సూచించారు.

భగత్ సింగ్ ఆశయాలను కొనసాగిస్తాం



ప్రజాశక్తి - క్యాంపస్ : స్వాతంత్ర సమరయోధులు, విప్లవ యువకిశోరులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 94వ వర్ధంతిని ఆదివారం తిరుపతిలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ విగ్రహాల ముందు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి మురళిలు మాట్లాడుతూ, భగత్ సింగ్,రాజ్ గురు,సుఖ్ దేవ్‌ల పోరాట స్ఫూర్తితో విద్యార్థి, యువజన సమస్యల పరిష్కారం కొరకు రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భగత్ సింగ్ జయంతి వర్ధంతిలను అధికారికంగా జరపాలని, భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నం పెంచలయ్య , ఏఐవైఎఫ్ మాజీ నాయకులు లక్ష్మయ్య, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ చలపతి,ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఉదయ్ కుమార్, ప్రవీణ్ కుమార్ , ఏఐటియుసి నగర కార్యదర్శి ఎన్ డి రవి, శాఖా కార్యదర్శి పద్మనాభరెడ్డి, మునీశ్వర్ ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి పూర్ణ,ఆటో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు వెంకటేష్,సురేష్, గుజీరి వ్యాపారుల సగం జిల్లా కార్యదర్శి అల్లా బక్షు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చంద్రనాయక్, ఓం రాజ్, విద్యార్థి యువజన ,పార్టీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎస్వీయులో సమరయోధులు సర్దార్ భగత్ సింగ్ రాజ్ గురు, సుగుదేవ్‌ల 94వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రంజిత్ కుమార్ మాట్లాడుతూ భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. దేశభక్తితో యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడమే లక్ష్యం



సాంప్రదాయ వేషధారణలో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం), తిరుపతి సిటి: నేనున్న పోటీ ప్రపంచంలో విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడమే లక్ష్యంగా మా విద్యా సంస్థ అయిన శ్రీ వెంకటేశ్వర చిల్డ్రన్స్ హై స్కూల్ నిత్యం పనిచేస్తుందని పాఠశాల చైర్మన్ కె.ఎస్ వాసు అన్నారు. ఆదివారం తిరుపతి మహతి కళాక్షేత్రం వేదికగా శ్రీ వెంకటేశ్వర చిల్డ్రన్స్ హై స్కూల్ 48వ వార్షికోత్సవాన్ని రంగోత్సవ్-2025 పేరుతో 27 రకాల అర్థవంతమైన కల్చరల్ కార్యక్రమాలను విద్యార్థులతో నిర్వహించారు. ఎప్పుడు విద్య కాకుండా పిల్లల్లో సామర్థ్యాన్ని పెంచుకునే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాలల్లో ఉన్న 1200 మంది విద్యార్థులకు దేశభక్తి, దైవభక్తి, గురుభక్తి, తల్లిదండ్రులపై భక్తి, సత్ప్రవర్తనలను నృత్య, నాటక రూపాలలో ప్రదర్శించి వార్షికోత్సవానికి హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ప్రేక్షకులకు ఎంతో అనుభూతుని కలిగించిందన్నారు. పాఠశాల ఉపాధ్యాయుల సహకారంతో ఆధ్యాత్మిక భావనలను పిల్లలకు అర్థమయ్యే రీతిలో ప్రదర్శించడం జరిగిందన్నారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో ప్రైమరీ హెడ్ మిస్ మాధవి, పబ్లిక్ రిలేషన్ మేనేజర్ బి.ఈశ్వర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అవిశ్వాస ప్రయత్నంలో
టిడిపి అబాసు పాలే

- ఏప్రిల్ 9న జరిగే అవిశ్వాస తీర్మానంలో వైసీపీదే విజయం
- టిడిపి ప్రలోభాలు, అక్రమ కేసులను ఎదుర్కొంటాం
- వెంకటగిరి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి



ప్రజాశక్తి -వెంకటగిరి: ఏప్రిల్ 9వ తేదీన వెంకటగిరి మున్సిపాలిటీలో జరిగే అవిశ్వాస తీర్మానంలో వైఎస్ఆర్సిపి విజయం తథ్యమని, టిడిపికి భంగపాటు తప్పదాని నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలియజేశారు. ఆదివారం వెంకటగిరిలోని ఆయన నివాసంలో వెంకటగిరి మున్సిపల్ కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మున్సిపాలిటీలో 25 మంది కౌన్సిలర్లలో ఒక్క కౌన్సిలర్ కూడా లేని టిడిపి ఒకర్ని ఎన్నుకొని అవిశ్వాస తీర్మానం పెట్టి అధికార దుర్వినియోగానికి తెరలేపిందని విమర్శించారు. 100 శాతం సభ్యులు ఉన్న వైఎస్సార్సీపిపై పోటీకి దిగడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ప్రభుత్వ అధికార దుర్వినియోగానికి ఇదే నిదర్శనం మండిపడ్డారు. ప్రజలు, కౌన్సిలర్లు వైఎస్ఆర్సిపి వైపే ఉన్నారని తప్పకుండా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో, ఆయన వెంట నడుస్తామని తనను కలిసిన 18 మంది కౌన్సిలర్లు ముక్తకంఠంతో స్పష్టం చేశారన్నారు. అడ్డదిడ్డంగా పాలిస్తాం, ప్రలోభాలు పెడతాం, కేసులు పెడతాం, అంటూ టిడిపి ఎన్ని కుయత్నాలు చేసినా మున్సిపాలిటీలో అవిశ్వాసంలో ఆ పార్టీకి ఓటమి తప్పదన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు నిజాయితీగా వైఎస్సార్సీపీకి పట్టం కట్టారని ఇకపై కౌన్సిల్ పదవీకాలం ఉన్న ఈ ఏడాది అదే నిబద్ధతతో వైఎస్ఆర్సిపి మున్సిపాలిటీలో పాలన సాగిస్తుందని తెలియజేశారు. అనంతరం అనారోగ్యంతో చికిత్స పొంది ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్.బాలయ్యను నేదురుమల్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

తిరుమల శ్రీవారి దర్శనానికి నటుడు సుమన్



ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుమల శ్రీవారి దర్శనార్థమై ప్రముఖ సినీ నటుడు డాక్టర్ సుమన్ ఆదివారం తిరుపతికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎపిబిసి విద్యార్థి సంఘం అధ్యక్షుడు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గౌడ్ మాట్లాడుతూ శ్రీరామదాసు, సత్యనారాయణ వ్రతం, అయ్యప్ప కటాక్షం, అన్నమయ్య వంటి సినిమాలలో శ్రీ వేంకటేశ్వర స్వామి పాత్రలో అద్భుతంగా నటించి సుమన్ తెలుగు ప్రజల మెప్పు పొందారన్నారు.

వెంకన్నా.. మా మొర ఆలకించవా..?

216 వ రోజుకు చేరిన శ్రీ వారి మెట్టు వ్యాపారుల నిరసన దీక్ష

టీటీడీ బోర్డ్‌కు బాధితుల వేడుకోలు




ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి, శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులు చేపట్టిన నిరసన దీక్షలు శనివారం నాటికి 216 రోజులకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వ్యాపారులు శ్రీవారి చిత్ర పటాన్ని నెత్తిన పెట్టుకొని అలిపిరి పాదాల వద్ద 100 కొబ్బరి కాయలు కొట్టి తమ సమస్యలు పరిష్కరించమని వేడుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర మాట్లాడుతూ టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు, ఈఓ శ్యామలరావు, అడిషనల్ ఇఓ వెంకయ్య చౌదరిలు పట్టించుకుని సమస్యల పరిష్కారానికి తోడ్పడాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిట్టిబాబు, మధు, యుగంధర్, చిరంజీవి, రాంబాబు, ప్రకాష్, గోపి మల్లి, రామమూర్తి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

పండుగ తోఫా ఎక్కడ..?

◆ ముస్లింలకు రంజాన్ తోఫా.. హిందువులకు ఉగాది సరుకులు ఎక్కడ?

◆ రెండు పండుగలు వస్తున్నా స్పందించని ప్రభుత్వం







ప్రజాశక్తి - తిరుపతి టౌన్: 2014 నుంచి 2019వ సంవత్సరాల మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం హిందువుల సంక్రాంతి కనుక, క్రిస్టియన్లకు క్రిస్మస్ కానుక, ముస్లింలకు రంజాన్ తోఫా పేరుతో వివిధ రకాల నిత్యావసర సరుకులు సరఫరా చేసింది. 2024 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ 10 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఏ ఒక్క పండుగకు తోఫాలు పంపిణీ చేయలేదు. గతంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని రేషన్ కార్డు ఉన్న ముస్లిం కుటుంబాలకు గోధుమపిండి, చక్కెర, సేమ్యా, ఆయిల్, నెయ్యితో కూడిన తోఫా అందజేసింది. ఈ నెల 31వ తేదీన రంజాన్ పండుగ ఉండటంతో ఇప్పటి వరకు రంజాన్ తోఫా ఊసే లేకపోవడంతో ముస్లింలు పెదవి విరుస్తున్నారు. రేషన్ షాపుల ద్వారా బియ్యం, చక్కెర తప్ప ఇతర సరుకులు ఇవ్వకపోగా రంజాన్ పండుగకు ఎలాంటి సరుకులు ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బియ్యం చెక్కరతోనే సరి

పేదల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రతి నెలా అందించే రేషన్ సరుకుల్లో భారీగా కోత పెడుతోంది. కార్డుదారులకు అన్ని రకాల సరుకులు అందడం లేదు. రేషన్ షాపుల్లో బియ్యం, చక్కెర మాత్రమే ఇస్తున్నారు. ఈ నెలలో హిందువులకు, ముస్లింలకు పండుగలు వస్తున్నా ప్రభుత్వంలో కనీస స్పందన కరువైంది. కందిబేడలకు మార్కెట్లో ధర పెరగడంతోపాటు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో సబ్సిడీపై అందించకుండా కోత పెట్టినట్లు తెలుస్తోంది. మార్కెట్లో కందిపప్పు కిలో రూ. 150 ధర పలుకుతుండటంతో పేద, సామాన్య ప్రజలుకు కొనడం భారంగా మారింది. ఈ నెలలో కార్డుదారులకు కందిపప్పు పంపిణీ చేయకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెలాఖరులో హిందువులకు ఉగాది పండుగ ఉంది. అలాగే ముస్లింలకు పవిత్ర రంజాన్ పండుగ వస్తోంది. పండుగల నేపథ్యంలో కూడా కందిపప్పు, ఇతర నిత్యావసర సరుకులు ఇవ్వలేదు.

ఎండియు వాహనాలు ద్వారా పంపిణీ చేయండి

రేషన్ సరుకులు ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దనే పంపిణీ చేయాలని లబ్దిదారులు కోరుతున్నారు.గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరఫరా చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎండీయూ వాహనాల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. కొందరు ఆపరేటర్లు విధుల నుంచి తప్పుకోగా, కొన్ని గ్రామాల్లో ఆపరేటర్లను బలవంతంగా తొలగించారు. ఎండీయూ వాహనాలు లేని గ్రామాల్లో డీలర్లు ఇళ్ల వద్ద ప్రజా పంపిణీని కొనసాగిస్తున్నారు. మరికొన్ని వాహనాలు మరమ్మతులకు గురికావడంతో ఎండీయూ వాహనాలు కనుమరుగయ్యాయి. ఒకవైపు సరుకుల్లో కోత, మరోవైపు సరుకులు సక్రమంగా ఇంటికి సరఫరా కాక వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు బియ్యం, చక్కెరతోపాటు కందిపప్పు, జొన్నలు, రాగులు, తదితర నిత్యావసర సరుకులు కార్డుదారుల ఇళ్లవద్దనే సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని, పండుగ తోఫాలు కొనసాగించాలని కోరుతున్నారు.

సిబ్బంది రారు.. వచ్చినా పని చెయ్యరు..!





ఉదయం 11 దాటినా ఖాళీ కుర్చీలు

పడిగాపులు తప్పవు..

ప్రజాశక్తి - పెళ్లకూరు: పెళ్లకూరు మండలం, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలవుతున్నా ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. సిబ్బంది రాకకోసం ప్రజలు పడిగాపులుగాసే పరిస్థితి. గత కొన్ని నెలలుగా గ్రీవెన్స్ డేకు కూడా అర్జీలు కరువయ్యాయి. పలు గ్రామాల ప్రజలు పనులు మానుకొని, వారి సమస్యలపై అర్జీ సమర్పించుకుందామని వస్తే సిబ్బంది దొరకరు. పరిసర గ్రామాల్లో రియల్టర్లు వెంచర్లు వేసి వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆక్రమణలు, అక్రమాలపై ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడే లేడు. గతంలో ఎంపీడీవో నాగమోహన్ ఆక్రమణలపై సర్పంచి, ప్రజల సమక్షంలో సర్వే చేయించి ఆక్రమణలు తొలగించారు. ప్రస్తుతం పలు వెంచర్ల విషయమై ఎంపీడీవోని వివరణ కోరగా అది ఈవోపీఆర్డీ పరిధి నాకు సంబంధం లేదు అంటున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈవోపీఆర్డీ వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. గ్రామ పంచాయతీయులకు రావలసిన ఆదాయ వనరులకు గండి కొట్టి, స్వలాభంతో పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఎంపీడీవో కార్యాలయానికి ఎప్పుడు వస్తారో ప్రజలకు తెలియని పరిస్థితి. ప్రజలు కలెక్టర్ ఆఫీస్ చుట్టూ, మండల కార్యలయాలు చుట్టూ తిరిగి విసిగి వేసారి పోయి కోర్టులను ఆశ్రయిస్తున్నారు. అయినా పెళ్ళకూరు మండలంలో కోర్టు ఉత్తర్వులు అమలు చేసే అధికారులు కరువయ్యారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటున్న అధికారులపై విచారణ చేపట్టి, ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

సమయపాలన పాటించని రెవిన్యూ సిబ్బంది

పెళ్ళకూరు మండలం, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించి, ప్రజలకు అందుబాటులో ఉండి, రెవెన్యూ సమస్యలు తీర్చవలసిన వారు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. గత కొన్ని నెలలుగా ఉదయం 10 గంటలకు ఆఫీసు తలుపులు తెరిచిన దాఖలా లేదు. తలుపులు తెరిచిన అందులో అరకొర సిబ్బంది ఉంటారు. ఇక వీఆర్వోల విషయానికొస్తే వారే రాజులు వారే మంత్రులు. సక్రమంగా విదులు నిర్వహిచేవారు ఏఒకరో ఇద్దరో మాత్రమే. ఒక్కొక్క విఆర్ఓ రెండు పంచాయతీలకు ఇన్చార్జీగా ఉన్నందున, విధినిర్వహణలో అక్కడి పనులు చూస్తున్నామని, మరోసారి ఇక్కడ పనులు చూస్తున్నామని, చెబుతున్నారు. రైతులు, విద్యార్థులు వారి సమస్యల పరిష్కారానికి నెలల తరబడి తిరగాల్సి వస్తోంది. ప్రభుత్వ భూములలో రోడ్ల నిర్మాణాలు, రియల్టర్ల అక్రమమాలు, యదేచ్ఛగా జరుగుతున్నా కన్నెత్తి చూడరు.

పరిస్థితుల మార్పుకోసం రైతులు, విద్యార్థులు, ప్రజలు ఎదురుచూస్తున్నారు.

నేడు, రేపు విద్యుత్ సబ్ స్టేషన్ కమిటీ సమావేశం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్ర నాయుడు, డిఈఈ ఆశీర్వాదం, ఏడీఈ శంకరయ్యల ఆదేశాల మేరకు ఈరోజు, రేపు విద్యుత్ సమస్యలు పరిష్కరించడానికి పుత్తూరు అర్బన్, రూరల్ మండలాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఏఈలు జయ్ సాయి, రవి కుమార్‌లు తెలిపారు. ఈ అవకాశాలను విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కరెంటు కట్ బాధలు తీర్చండి

ప్రజాశక్తి - బాలాయపల్లి: బాలాయపల్లి మండలం, జయంపు ఎస్సీ కాలనీలో కరెంటు కోతతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎండలు పెరిగి ఉక్కపోతతో వృద్ధులు, పిల్లలు అవస్థపడుతున్నారు. గత రెండు వారాలుగా కరెంటు సరిగా ఉండటం లేదని కాలనీవాసులు తెలుపుతున్నారు. రాత్రిపూట నాలుగైదు గంటలు కరెంటు కట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తమ ఇబ్బందిని పట్టించుకుని కరెంటు కోతలు లేకుండా చూడాలని కోరుతున్నారు.

స్విమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: స్విమ్స్ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం చేయాలని ఆదివారం ఉదయం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, నగర ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్‌లు మాట్లాడుతూ స్విమ్స్ ఆసుపత్రిలో దాదాపు వెయ్యి మంది కార్మికులు పనిచేస్తుంటే, వారి సమస్యలు పట్టించుకోకుండా, ఒకరిపై ఒకరు స్విమ్స్, టిటిడి అధికారులు చెప్పుకుంటూ సమస్య దాటవేస్తున్నారన్నారు. ఈనెల 26వ తేదీ టిటిడి ఏడీ బిల్డింగ్ వద్ద సామూహిక వినతికై కార్మికులందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. గతంలో కార్మిక శాఖ, టిటిడి యాజమాన్యానికి, రాష్ట్ర ప్రభుత్వానికి వినతులు ఇచ్చినప్పటికీ మార్పు లేదన్నారు. కార్మికుల పట్ల స్విమ్స్ డైరెక్టర్ ప్రవర్తన వైఖరి మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ కార్మికుల యూనియన్ ప్రెసిడెంట్ సూరి, కోశాధికారి మారి ముత్తు, నాయకులు మునికృష్ణ, వెంకటేష్, భాష, శ్రీను, ఎం.వెంకటేష్, రాజశేఖర్, జయచంద్ర, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

యువత భగత్ సింగ్ బాటలో నడవాలి



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా, తిరుపతి, ఎం.జి.ఎం ఉన్నత పాఠశాలలో భగత్ సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎం.జి.ఎం హెడ్ మాస్టారు ముని శరద్, డి.వై.ఎఫ్.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.జయచంద్ర, జిల్లా అధ్యక్షులు ఎం.నరేంద్ర, యు.టి.ఎఫ్ జిల్లా కార్యదర్శి బండి మధుసూదన్ రెడ్డిలు మాట్లాడుతూ కుల ,మత, పేద, ధనిక తారతమ్యాలు లేకుండా బతకాలంటే సోషలిజమే మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు సురేష్, అజయ్, యుగంధర్,చందు యు.టి.ఎఫ్ నగర అధ్యక్షులు హేమాద్రి పి.డి లక్ష్మి పాల్గొన్నారు.

ఉదయం 9 నుండే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: వేసవికాలం ఎండల దృష్ట్యా సోమవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, 9.30 నుండి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాలు నిర్వహించబడతాయని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ వసతి గృహాల తనిఖీ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ప్రభుత్వ వసతి గృహాలను సర్కిల్ ఇన్స్పెక్టర్ తిమ్మయ్య, సబ్ ఇన్స్పెక్టర్ విశ్వనాథ నాయుడు ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. నిర్వాహకులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్ దగ్గర స్టాప్ బోర్డుల ఏర్పాటు



ప్రజాశక్తి- వెంకటగిరి టౌన్: ప్రజాశక్తి దినపత్రికలో శనివారం రోజు భాష్యం స్కూల్ దగ్గర ఉన్న స్పీడ్ బ్రేకర్ వల్ల నిత్యం జరుగుతున్న ప్రమాదాలను నివారించండి అని వచ్చిన వార్తకు స్పందించి అధికారులు స్పీడ్ బ్రేకర్లకు ఇరువైపులా స్టాప్ బోర్డులు పెట్టించారు. స్పీడ్ బ్రేకర్‌కి వైట్ కలర్ రంగు వేయించి ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

ముత్యాలమ్మ జాతర సజావుగా జరగాలి



ప్రజాశక్తి - చిల్లకూరు : జాతర సజావుగా జరగాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పాశంసునీల్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం జరిగిన ముత్యాలమ్మ అమ్మవారి జాతర కోఆర్డినేషన్ సమావేశంలో ముఖ్య అతిథిగా పాలొన్నారు. కార్యకర్తలను, గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూలైన్లు, మంచి నీరు, మజ్జిగ పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసువారు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.

మహిళలు, వాకర్స్ భద్రతకు భరోసా



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు, ఎస్ఆర్ఎస్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ గ్రౌండ్‌లో పుత్తూరు అర్బన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆదివారం వాకర్సును కలిసి వారి సమస్యల గురించి తెలుసుకొన్నారు. వారికి భద్రత కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

ప్రజా సాధికారిక ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదానం



రక్తదానం చేసిన యువకులకు పండ్లు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ నిర్వహకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రజా సాధికారిక ట్రస్ట్ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్ర చిత్తూరు వారి సహకారంతో సాహిద్ దివాస్ సందర్భంగా యువతలో త్యాగాల స్ఫూర్తిని నింపి దేశం కోసం మృత్యువు నీ ముద్దాడిన సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల త్యాగాలను స్మరించుకుంటూ రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం జరిగిందని ట్రస్ట్ నిర్వాహకులు శివయ్య, రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం మానవాళికి చాలా కీలకమైనదని, ఆపదలో ఉన్నవారికి ఇటువంటి రక్తదాన కార్యక్రమం ద్వారా సేకరించిన రక్తం ఎంతో ఉపయోగపడి వారి ప్రాణాలను కాపాడుతుందన్నారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసిన యువకులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో, ప్రజా సాధికారిక ట్రస్ట్ సభ్యులు నారాయణ, పూజ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవా భావాన్ని అలవర్చుకోవాలి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అందరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలని శ్రీకాళహస్తి డిఎస్పి నరసింహమూర్తి పిలుపునిచ్చారు. హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని పలువురు పేదలకు నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా డిఎస్పీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆ సంస్థ చేస్తున్న సేవలను కొనియాడారు. సంస్థ నిర్వాహకులు మునీర్ బాషాను ఆదర్శంగా తీసుకొని తమకున్నంతలో ఆపదలో ఉన్న వారికి సాయం చేయాలని డిఎస్పీ సూచించారు. వన్ టౌన్ సిఐ గోపి, న్యాయవాది రాజేశ్వరరావు, గరికపాటి రమేష్, కోళ్ల హరి, కంఠా ఉదయ్, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్సతో 'ఆత్మస్థైర్యం'



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్ విభాగంలో తర్ఫీదు పొందడం వల్ల ఆత్మస్థైర్యాన్ని, శారీరక దృఢత్వాన్ని పొందగలరని శ్రీకాళహస్తి డిఎస్పి నరసింహమూర్తి తెలిపారు. స్థానిక సరోజిని కళ్యాణ మండపంలో కెనీ షిటో ర్యూ కరాటే డు ఇండియా ఆధ్వర్యంలో కరాటి బెల్ట్ ఫీడింగ్ ఈయామి నేషన్ కార్యక్రమం జరిగింది. మార్షల్ ఆర్ట్స్ వల్ల విద్యార్థుల్లో చురుకుతనంతో పాటు పట్టుదల పెరుగుతుందని డీఎస్పీ చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐలు గోపి, వెంకటేశ్వర్లు, రవి నాయక్, తిమ్మయ్య, కరాటే కోచ్ ధనుష్, సతీష్, సురేష్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో కొండూరు సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారంతో ఐ.సి.ఎస్ రోడ్డులో కూరగాయల మార్కెట్ పక్కన ఆదివారం చలివేంద్రంను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రెజరీ కాటూరు శ్రీనివాసులు, పూడి విజయకుమార్, కొండూరు హరిబాబు, ప్రగతి కుటుంబ సభ్యులు ఐటిఐ ప్రభాకర్, కె ఆర్ ఎం, రిటైర్డ్ ఎస్సై ప్రభాకర్, కేఆర్ఎం ఆర్ వి కన్సల్టెంట్ వెంకట కృష్ణయ్య ప్రజేంద్ర రెడ్డి, పిల్లిల శ్రీనివాసుల, కోట వెంకటేశ్వర్లు, పోతిరెడ్డి పెంచలయ్య, డిష్ నాగరాజు లలిత బ్రాండ్ వెంకటేశ్వర్లు, నారాయణ, శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, విజయ్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు : ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్



ప్రజాశక్తి - పుత్తూరు : రంజాన్ పురస్కరించుకొని పుత్తూరు మున్సిపాలిటీ, గేట్ పుత్తూరులో మజీద్ సాహెబ్ ఆధ్వర్యంలో ఆదివారం పేద ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కరుణాకర్, నాయకులు గణేష్, అమ్ములు, షణ్ముగ రెడ్డి, అశోక్, సుధ, కృష్ణ కుమార్, దొరస్వామి, హామీద్ బాషా, చాన్, సద్దర్, యూనిష్ సకీల్, ఫజిల్, రసూల్, జాఫర్, రఫీ, జాబీర్, తెలుగు మహిళ మోహన ముస్లింలు పాల్గొన్నారు.

రేపు శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మార్చి 30న ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని 25 మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఆనంద నిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రంగా కడుగుతారు. ఈ సమయంలో స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పుతారు. శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కారణంగా మార్చి రేపు వీఐపీ బ్రేక్ దర్శనాలు, అష్టదళ పాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది. ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించబడవని తెలియజేశారు.

శ్రీ కోదండరామ స్వామి వారి ఆలయంలో..

ప్రజాశక్తి - తిరుపతి : తిరుపతి శ్రీ కోదండరామస్వామివారిలో ఆలయంలో 25 మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఆలయంలో మార్చి 27 నుండి ఏప్రిల్ 4వ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా మార్చి రేపు తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఉదయం 6.30 నుండి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రమిశ్రమాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

రంజాన్ తోఫా పంపిణీ



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, షాది మంజిల్‌లో మహమ్మదీయ వెల్ఫేర్ నెట్వర్క్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన 160 పేద ముస్లిం కుటుంబాలకు ఆదివారం రంజాన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నెట్వర్క్ అధ్యక్షుడు షేక్ మహబూబ్ బాష, గౌరవ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్, మసీదుల ముతవల్లి కమిటీ అధ్యక్షులు అబ్దుల్ రహీం, నెట్వర్క్ సభ్యులు షేక్ రఫీ, షేక్ బాబర్, అన్వర్, గోల్డ్ నాజర్, అలీ హుస్సేన్, ఓడూరు నాజర్, నజీమ్, అప్సరా కరీముల్లా, లలితా మెడికల్స్ యూసుఫ్ హుస్సేన్, షఫీ మౌలానా, చాన్ భాష, తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యకు ప్రాధాన్యం



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : నేటి సమాజంలో నర్సింగ్ విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారని తిరుపతి డిస్ట్రిక్ట్ మెడికల్ అండ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాలక్రిష్ణ నాయక్ తెలిపారు. తిరుపతి, మల్లంగుంటలోని వాగ్దేవి కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో ఆదివారం లాంప్ లైటింగ్ సెరిమణి-2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తిరుపతి డిఎం అండ్ హెచ్ ఓ డా. బాలక్రిష్ణ నాయక్ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ రంగంలో నర్సింగ్ అనేది ఒక ముఖ్యమైన విభాగమని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్వో (చంద్రగిరి) మురళీకృష్ణ, వికాస్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ చైర్మన్ దుర్గాప్రసాద్, వాగ్దేవి కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ డా. కూనపల్లె లావణ్య కుమారి, పరిపాలనాధికారి తోట. భార్గవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జనసైనికులు పేదలకు అండగా నిలవాలి



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : జనసేన 35వ డివిజన్ నాయకులు డాక్టర్ హరికృష్ణా రాయల్ ఆధ్వర్యంలో ఆదివారం రైల్వేకాలనీలోని వార్డు సచివాలయం ఆవరణలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. జనరల్ మెడిసిన్, గైనకాలజీ సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్వయంగా బిపి పరీక్ష చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ అఖిల, డాక్టర్ కళ్యాణ్ కుమార్ లతోపాటు జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ హరిప్రసాద్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కార్పోరేటర్లు వరికుంట్ల నారాయణ, అన్నా అనితా యాదవ్, ఎన్డీఏ నాయకులు సింగంశెట్టి సుబ్బరామయ్య, రాజా రెడ్డి, నైనార్ శ్రీనివాస్, కంచి శ్యామల, గుత్తా నాగరాజు రాయల్, ఆర్సీ కుమార్, ఆముదాల వెంకటేష్, ఆళ్వార్ మురళీ, శంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ ప్రభుత్వం అన్నివిధాల ఆదుకుంటుంది: ఎమ్మెల్యే ఆరణి



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : బ్రాహ్మణులను ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. ఏపి బ్రాహ్మణ, అర్చక, పురోహిత సంక్షేమ సేవా సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం శ్రీనివాసమంగాపురంలోని ఓ సత్రంలో జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టిటిడి ట్రస్ట్ బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విన్నవించుకున్న వివిధ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపి బ్రాహ్మణ, అర్చక, పురోహిత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు దూర్వాశుల రామస్వామి, ప్రధానకార్యదర్శి ములుగు కిరణ్ కుమార్, మల్లెం రంగనాథ శర్మ, శీను స్వామి, కాకుమాను సిద్ధాంతి, కోడూరు గౌతమ్ శర్మ, ఆలూరు సాయి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సామ్రాజ్య వాదానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా యువత పోరాడాలి



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : సామ్రాజ్యవాదానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా యువత పోరాటాల్లోకి రావాలని మాజీ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆర్.వెంకటేష్ పిలుపునిచ్చారు. పుత్తూరు బిసి బాలుర వసతి గృహంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్‌కు నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఉమేష్ చంద్ర, వినయ్, ఉపేంద్ర, శ్రీనివాసులు, సురేష్, రాజశేఖర్ హాస్టల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హిందీ పండిట్ మల్లీశ్వరికి డాక్టరేట్ ప్రదానం



ప్రజాశక్తి -పిచ్చా టూరు: పిచ్చాటూరు జడ్పీ హైస్కూల్‌లో హిందీ పండిట్‌గా పనిచేస్తున్న రాయల మల్లేశ్వరి ఆదివారం డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. పాండిచ్చేరిలో ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ నిర్వహించిన ఈ డాక్టరేట్ ప్రధానం కార్యక్రమంలో యునైటెడ్ నేషన్ ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్ డాక్టరేట్‌ను మల్లీశ్వరికి ప్రధానం చేసింది. ఈ కార్యక్రమంలో మల్లీశ్వరి తల్లిదండ్రులు రాయల భాగ్యమ్మ, రాయల శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై కార్యక్రమం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయు స్టూడెంట్ వెల్ఫేర్ కల్చరల్ అఫైర్స్, సెట్విన్ కోఆర్డినేటర్స్ డా.పత్తిపాటి వివేక్, మోహన్ కుమార్ ఆధ్వర్యంలో నేడు "వ్యక్తిత్వ వికాసం" కార్యక్రమం వర్సిటీలోనూ, వర్సిటీ అనుబంధ కాలేజీ శ్రీ పద్మావతి మహిళా కళాశాలలో రెండు వేదికలపై నిర్వహించనున్నారు. రెండు వేదికలపై ముఖ్య అతిథిగా శాప్ చైర్మన్ రవి నాయుడు, ముఖ్య వక్తగా హైదరాబాద్‌కు చెందిన సోను శ్రీనివాస్ పాల్గొననున్నారు. ఈ కార్యక్రమాల్లో మధ్యాహ్నం 03 గంటలకు ఎస్వీయు విసి అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, మహిళా వర్సిటీ విసి ఆచార్య ఉమ, కళాశాల ప్రిన్సిపాల్ నారాయణమ్మ, ఆచార్య మురళీధర్ పాల్గొననున్నారు.

క్రైం న్యూస్

అదుపుతప్పిన కారు.. ఒకరు మృతి, ఆరుగురికి గాయాలు






మృతి చెందిన సబ్రీన్ ఫాతిమా

ప్రజాశక్తి - తడ: తడ మండలం, పెరియావట్టువద్ద ఆదివారం ఉదయం కారు అదుపుతప్పిన ప్రమాదంలో సబ్రీన్ ఫాతిమా(21) అను మహిళ మృతి చెందారు. మరో ఆరుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు చెన్నై, తాంబరం నుండి వరదయ్యపాలెం ఉబ్బలమడుగుకు కారులో సరదాగా గడిపేందుకు ఏడు మంది స్నేహితులు వచ్చారు. పెరియావట్టు వద్ద అతి వేగంగా వస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. కారు వేగంగా టెంకాయ చెట్టును ఢీకొని కారు నుజ్జునుజ్జు అయింది. సబ్రినా ఫాతిమా అను మహిళ అక్కడికక్కడే చనిపోగా, మిగిలిన ఆరుగురు బెన్ జమిన్(26), ఆలియా బేగం(23), శ్రీమాన్(20), మాధేష్(21), దీన(34), మహమద్ ఆవాజ్ (26)లు తీవ్రంగా గాయపడ్డారు. మహమ్మద్ ఆవాజ్ కారు నడుపుతున్నట్లు పోలీసు వారు తెలిపారు. క్షతగాత్రులను యలావూరు చెక్ పోస్ట్ హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కొరకు చెన్నైలోని స్టాన్లీ హాస్పిటల్‌కు పంపారు. మహిళ మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసు వారు తెలిపారు.

స్కూటర్ అదుపుతప్పి ఉపాధ్యాయుడు మృతి



శివ కేశవులు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - రామచంద్రపురం: మండలంలోని రాయల చెరువు పేట-పచ్చికాపలం ప్రధాన రహదారిలో సికె పల్లి క్రాస్ రోడ్డు వద్ద స్కూటర్ అదుపుతప్పి కింద పడిపోయిన ఘటనలో హిందీ ఉపాధ్యాయుడు ఎస్.శివ కేశవులు (44) శనివారం రాత్రి 10 గంటలకు అక్కడికక్కడే మృతి చెందారు. ఎన్ ఆర్ కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేసే ఎస్ శివ కేశవులు పుత్తూరులో జరిగిన ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొని తిరిగి స్వగ్రామమైన చట్టతూరు గ్రామానికి ద్విచక్ర వాహనంలో వస్తుండగా మొదట మలుపు వద్ద అదుపు తప్పి కింద పడ్డాడు. మరలా లేచి ద్విచక్ర వాహనాన్ని స్టార్ట్ చేసుకుని కొంత దూరం వెళ్లిన తర్వాత, మరలా అదుపుతప్పి తారురోడ్డుపై పడడంతో తలకు, ముఖానికి తీవ్ర గాయాలై, రక్తస్రావంతో కొట్టు మిట్టాడుతుండగా స్థానికులు 108కి ఫోన్ చేశారు. 108 సిబ్బంది వచ్చి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారని సమాచారం. ఆర్ సి పురం ట్రైనీ ఐపీఎస్ బొడ్డు హేమంత్, ఇన్చార్జి సిఐ చిన్న గోవిందుడు, ఇన్చార్జి ఎస్ఐ రవీంద్ర నాయక్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శవ పరీక్ష అనంతరం స్వగ్రామానికి తీసుకొచ్చి దహన సంస్కారాలు చేశారు. ఆయన మృతి పట్ల జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ఎన్ చిన్న బాబు, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, పి విజయ్ కుమార్ బాదురు కోటేశ్వర్ రెడ్డి, మురళి రెడ్డి, స్థానిక సర్పంచ్ చిరంజీవి రెడ్డి, మరియు పాఠశాల విద్యార్థిని విద్యార్థులు నివాళులర్పించి కన్నీటిపర్వంత మయ్యారు. టిడిపి నాయకులు కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ద్వితీయ భాషగా తెలుగును కొనసాగించాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఎంబైపీసీ విధానంలో ద్వితీయ భాషగా తెలుగును ఇప్పుడున్న విధంగా కాకుండా ఐచ్ఛికంగా తీసుకురావడం ఎంతో శోచనీయమని తిరుపతి జిల్లా తెలుగు ఉపాధ్యాయ సంఘం ఇంటర్మీడియట్ స్పాట్ వ్యాల్యూషన్ కేంద్రం ఎస్వీ జూనియర్ కళాశాలలో ఆర్ఐఓ ప్రభాకర్ రెడ్డికి ఆదివారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్ఐఓ స్పందిస్తూ ఇంటర్మీడియట్ కమిషనర్ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాదెండ్ల శ్రీమన్నారాయణ, దుర్గారావు, మీరా సాహెబ్, మునీంద్ర, గంగాధర్, జయమ్మ, వెంకట్రావు, శిరీష, రమ, ఉమాదేవి, మోహన్, శశికళ, నాగేశ్వరరావు, వాణి, ధనమ్మ, వెంకటరమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియులు ఐక్యంగా ఉండాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : క్షత్రియులందరూ ఐక్యమత్యంతో ఉంటేనే ఏ రంగాలైన సమస్యలను పరిష్కరించుకోవచ్చని క్షత్రియ సంఘం ప్రెసిడెంట్ దినేష్ ప్రతాప్ సింగ్ తెలిపారు. రాజస్థాన్, జైపూర్ మహల్ రాజవాడ రిసార్ట్‌లో ఆదివారం అఖిల భారత క్షత్రియ మహాసభ నిర్వహించారు. ఈ సభలో క్షత్రియ సంఘం నూతన సభులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రాజు, సెక్రటరీ కోనేటి రవిరాజు, ఏ పి యూత్ ప్రెసిడెంట్, బాలసుబ్రహ్మణ్యంరాజు, ఏ పి మహిళా అధ్యక్షురాలు నిశిదరాజు, తమిళనాడు మహిళా ఆధ్యక్ష రాలు, శోభారాజు, తిరుపతి జిల్లా ప్రెసిడెంట్ రామచంద్రరాజులు పాల్గొన్నారు.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీవోల బదిలీ

ప్రజాశక్తి - రామచంద్రపురం: తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గంలోని 4 మండలాల నరేగా ఏపీఓలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు బదిలీలు చేస్తూ డ్వామా పథక సంచాలకులు శ్రీనివాస ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వడమాల పేటలో ఏపీవోగా పనిచేస్తున్న పి.సునీతను రామచంద్రపురానికి, ఇక్కడ పనిచేస్తున్న ఏపీవో హంస వేణి వడమాలపేటకు, రేణిగుంటలో పనిచేస్తున్న ఓ జ్యోతిశ్రీని తిరుపతి రూరల్‌కు, తిరుపతి రూరల్‌లో పని చేస్తున్న మమతను పుత్తూరుకు, పుత్తూరులో పనిచేస్తున్న భార్గవిని చంద్రగిరికి, చంద్రగిరిలో పనిచేస్తున్న జ్యోతిని బాలయ్య పల్లికి, బాలయ్యపల్లిలో పనిచేస్తున్న ఆషారాణిని పాకాలకు, పాకాలలో పనిచేస్తున్న కళ్యాణిని తొట్టంబేడు మండలాల ఏపీవోలుగా బదిలీ చేశారు. యర్రావారిపాల్యం, చిన్నగొట్టుగల్లు మండలాల ఏపీఓలను మాత్రం బదిలీలు చేయలేదు. నూతన ఏపీవోలుగా సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించినట్లు సమాచారం.

టైం స్కేల్ అమలు చేయండి
టిటిడి సొసైటీ ఉద్యోగులు

ప్రజాశక్తి - తిరుపతి : టీటీడీలో వివిధ విభాగాలలో అవసరం మేరకు విద్యా అర్హత కలిగిన వారికి పరీక్షల నిర్వహించి, మెరిట్ లిస్ట్ ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ తమను నియమించుకొన్నారని టిటిడి సొసైటీ ఉద్యోగులు పేర్కొన్నారు. ఈవో ఆదేశాల మేరకు సొసైటీలుగా ఏర్పడి గత 15-20 సంవత్సరాలుగా వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నామన్నారు. తమకు టైం స్కేల్ వర్తింపజేయాలని, తమకంటే తక్కువ సర్వీస్ ఉన్నవారికి అన్ని సౌకర్యాలు కల్పించారని తమకు అన్యాయం జరుగుతుందని టీటీడీ ఈవో, జేఈవో, పాలకమండలి సభ్యులను, స్థానిక శాసనసభ్యులను కలసి టీటీడీ సొసైటీ ఉద్యోగులు వినతిపత్రాలు సమర్పించారు. 24 వ తేదీన జరగబోయే టీటీడీ బోర్డు సమావేశంలో సొసైటీ ఉద్యోగుల గురించి చర్చించి, టైం స్కేల్ మంజూరు చేయవలసిందిగా టీటీడీ అసోసియేషన్ నాయకులు ఒక ప్రకటనలో కోరారు.

జనసేన బలోపేతానికి కృషి చేయండి



పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ప్రజాశక్తి రామచంద్రపురం (చంద్రగిరి) : చంద్రగిరి నియోజకవర్గ జనసేన పార్టీ కేంద్ర కార్యాలయాన్ని ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, అరవ శ్రీధర్‌లు ప్రారంభించారు. ఆదివారం ఉదయం నాగాలమ్మ క్రాస్ నుంచి బైక్ ర్యాలీగా ఎమ్మెల్యేలు, జనసేన నాయకులు బయలుదేరి క్లాక్ టవర్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొత్తపేటలోని పార్టీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ చేసి, తరువాత కార్యాలయాన్ని ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, అరవ శ్రీధర్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, ఆకేపాటి సుభాషిణి, రాజారెడ్డి, టిడిపి నాయకులు దొడ్ల కరుణాకర్ రెడ్డి, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జీ మెడసాని పురుషోత్తం నాయుడు, ఆరు మండలాల జనసేన పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, వీర మహిళలు, యువత, కూటమి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.